aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTV NETWORK

www.mahaaprabha.com

నమస్తే
మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శనివారం
31-10-10-2026 సంపుటి : 01 సంచిక : 219 పేజీలు : 08 వెల : ₹ 5/-

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ NAMASTEY MAHAAPRABHA TGTEL/26/A0738 mahaaprabha.com Email : info@mahaaprabha.com



భారత్‌కు 87 పరుగుల
భారీ ఓటమి!

- 49 బంతుల్లో 107 పరుగులతో చెలరేగిన గ్లెన్ ఫిలిప్స్
- బ్రేస్‌వెల్ మెరుపులు.. కివీస్ స్కోరు 259/7
- 4 వికెట్లతో భారత బ్యాటింగ్‌ను దెబ్బతీసిన డఫీ
- 172 పరుగులకే పరిమితమైన టీమ్‌ఇండియా
- ఐదు టీ20ల సిరీస్‌లో కివీస్‌కు తొలి విజయం
- 3--1తో ఆధిక్యంలో భారత్.. ఆదివారం చివరి పోరు

03



మళ్లీ పగ్గాలిస్తే యూపీలో
యూసీసీ అమలు

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే విజయం
- ధీమా వ్యక్తం చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ప్రతిపక్షాల ఆరోపణలపై సమాజ్‌వాదీ పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు
- రామమందిరం, ఓటర్ల జాబితా అంశాలపై ప్రస్తావన
- యూపీలో బీజేపీ ప్రభుత్వాన్ని కదిలించలేరన్న అమిత్ షా

03

మియాపూర్ భూములు
పేదలకే!

లక్షా 50 వేల కోట్ల భూములు కాపాడాం



- నాడు కొట్టేద్దామని చూస్తే మేం అడ్డుకున్నాం
- కబ్జాకు కేసీఆర్‌తోపాటు బంధువుల యత్నం
- 550 ఎకరాలను రెండు రోజుల్లో స్వాధీనం చేసుకుంటాం
- ఈ భూములను పేదల సంక్షేమానికి వాడుకుంటాం
- సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాం
- కబ్జాపై అసెంబ్లీలో చర్చిద్దాం.. రండి
- ఆక్రమణదారులను ఎవరినీ వదలం
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (మహాప్రభ)

మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూములను రెండు రోజుల్లో స్వాధీనం చేసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ భూములపై సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో, దాదాపు రూ.50 వేల కోట్ల విలువైన ఆస్తిని కాపాడుకోగలిగామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన అనుచరులు రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి ప్రభుత్వ భూములను తమ అనుయాయులకు కట్టబెట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఢిల్లీలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వ భూములను పరిరక్షించడమే కాకుండా వాటిని పేదల సంక్షేమానికి వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయస్థానాల్లో సమర్థవంతంగా పోరాడి ఇప్పటివరకు రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములను కాపాడినట్లు -మిగతా 3 లో



ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణే
కాంగ్రెస్ లక్ష్యం

- హైదరాబాద్‌లో నిరసనకు ముందు అమిత్ షా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- ఓటు హక్కును కాపాడేందుకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పోరాటం
- జాతీయ జనగణనలో బీసీ కులగణనను వెంటనే చేర్చాలి
- ప్రభుత్వ భూములను కాపాడటం చారిత్రాత్మక విజయమన్న పొన్నం
- స్వతంత్ర వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు
- తెలంగాణ అమరవీరులను అవమానించినందుకు మోదీ, అమిత్ షా క్షమాపణ చెప్పాలి
- బీసీల గణాంకాలతోనే రిజర్వేషన్లు, సంక్షేమానికి సరైన ప్రణాళిక
- ఓటర్ల జాబితాలో అక్రమాలపై న్యాయపోరాటం తప్పదని స్పష్టీకరణ

తెలంగాణ బ్యూరో ప్రతినిధి:అక్టోబర్ 30 (మహాప్రభ)

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు 'ఓట్ బచావో'--దేశ్ బచావో', 'ఓట్ చోర్--గద్దీ ఛోడ్' నినాదాలతో కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పోరాటం సాగిస్తోందన్నారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై పోరాటం తప్పదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన న్యాయపోరాటం ఫలించి వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించగలిగామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి, న్యాయవ్యవస్థకు తెలంగాణ ప్రజల -మిగతా 3 లో

జనవరి 25 నుంచి జనగణన

- ఫిబ్రవరి 28 వరకు దేశవ్యాప్తంగా నిర్వహణ
- ఎన్నికలు జరిగే యూపీ, మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్‌కు మినహాయింపు
- మంచుకురిసే వేళలో జమ్ముకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో జనగణన ఉండదు
- మార్చి 1 నుంచి 5 వరకు సవరణాత్మక జనగణన

03



బీజేపీతో పొత్తుకు బీఆర్ఎస్
ఆరాటం

బీజేపీతో పొత్తు కోసం బీఆర్ఎస్ నేతల ప్రయత్నాలు

- చంద్రబాబును పొగడటం వెనుక రాజకీయ వ్యూహం
- గతంలో విమర్శలు.. ఇప్పుడు ప్రశంసలు ఎందుకని ప్రశ్న
- బీజేపీతో సయోధ్య కోసమే ఈ వైఖరని ఆరోపణ
- కాంగ్రెస్‌పై విమర్శలు.. బీజేపీ, టీడీపీలపై మౌనం
- బీఆర్ఎస్ సోషల్ మీడియా తీరుపై మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు
- ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించే ధైర్యం ఉందా?
- బావాబామ్మర్దుల చీకటి ఒప్పందాలను ఆధారాలతో బయటపెడతాం



బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకే బీఆర్ఎస్ నేతలు టీడీపీ అధినేత చంద్రబాబును పొగుడుతూ సయోధ్యకు ప్రయత్నిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గతంలో చంద్రబాబుపై విమర్శలు చేసిన నేతలు ఇప్పుడు ప్రశంసలు కురిపించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌పై నిత్యం విమర్శలు చేసే బీఆర్ఎస్ సోషల్ మీడియా, బీజేపీ, టీడీపీల విషయంలో మౌనం పాటిస్తోందని విమర్శించారు. నిజంగా రాజకీయ ధైర్యం ఉంటే ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించాలని సవాల్ విసిరిన ఆయన, బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్నాయని ఆరోపిస్తున్న చీకటి ఒప్పందాలను ఆధారాలతో బయటపెడతామని స్పష్టం చేశారు.

03



సింగరేణి కార్మికులకు
దీపావళి బోనస్

- నవంబర్ 5న సింగరేణి ఉద్యోగులకు దీపావళి బోనస్ చెల్లింపు
- ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 బోనస్
- డిప్యూటీ సీఎం భట్టి శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 30 (మహాప్రభ)

ఇటీవలనే లాభాల వాటా బోనస్ (దసరా బోనస్) ను అందుకున్న సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మరో తీపి కబురుగా నవంబర్ 5వ తేదీన దీపావళి బోనస్ ను చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సింగరేణి ఉద్యోగులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ బోనస్ (దీపావళి బోనస్)ను నవంబర్ 5వ తేదీన చెల్లించాల్సిందిగా సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. దీపావళి బోనస్‌గా రూ.419 కోట్లను చెల్లించనున్నట్లు ప్రకటించారు. -మిగతా 3 లో



భారత్‌లో
హైఅలర్ట్!

- భూటాన్‌లోని షింటాపు సరస్సు ఉప్పొంగడంతో ఆకస్మిక వరదలు
- పశ్చిమబెంగాల్, అస్సాంలోని పలు ప్రాంతాలకు ముప్పు
- గాసా త్సాచు వేడినీటి బుగ్గ వద్ద సౌకర్యాలు ధ్వంసం
- ముందస్తు చర్యలతో తప్పిన ప్రాణనష్టం
- ధుబ్రి, డార్జిలింగ్, అలీపుర్‌దువార్, జల్‌పాయిగురి జిల్లాలకు హెచ్చరికలు
- సంకోష్ నది పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

03

విభేదాలొస్తే అత్యాచారం అనలేం!



- పరస్పర సమ్మతితో కొనసాగిన బంధంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- సంబంధం విఫలమైతే క్రిమినల్ కేసుగా మార్చలేరని స్పష్టీకరణ
- అత్యాచారం, మోసం ఆరోపణల మధ్య తేడా గుర్తించాలని సూచన
- కేరళ వ్యక్తిపై నమోదైన కేసు విచారణలో ధర్మాసనం వ్యాఖ్యలు
- గత వివాహాన్ని దాచిపెట్టి రెండో పెళ్లి చేసుకున్నాడని మహిళ ఆరోపణ
- విఫలమైన బంధాలపై క్రిమినల్ కేసులు పెరుగుతున్నాయని ఆందోళన

03

దేశం కష్టాల్లో ఉంటే విపక్షాలకు సంతోషం!



- ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు
- దేశంలో వదంతులు వ్యాప్తి చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపణ
- ఇరాన్--అమెరికా ఉద్రిక్తతల వేళ రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు
- ఎరువులు, గ్యాస్ కొరతపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యలు
- రైతులపై అంతర్జాతీయ ఎరువుల ధరల భారం పడనివ్వం
- పీఎం కిసాన్ 24వ విడతలో రూ.19 వేల కోట్ల నిధుల విడుదల
- 9.34 కోట్ల మంది రైతుల ఖాతాల్లో జమ అయిన పెట్టుబడి సాయం

03

మహా 'ట్విస్ట్' ఉండనుందా..

- ఠాక్రే సోదరులతో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ భేటీ
-మహాయుతి కూటమిలో విభేదాలతో కొత్త సమీకరణాలపై చర్చ



ముంబై అక్టోబర్ 30 (మహాప్రభ)
మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామానికి తెర లేవనుందా? అధికార మహాయుతి కూటిమిలో విభేదాలు బయటపడుతున్న వేళ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్.. శివసేన(యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎస్ఎన్) చీఫ్ రాజ్ ఠాక్రే ఒకే వేదికపై కనిపించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వీరు ముగ్గురు ఒక పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడమే కాకుండా, ఒకే గదిలో ఏదో విషయమై చర్చించుకుంటున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వరకు బీజేపీ, ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కలిసి మహాయుతి కూటమిగా ఐక్యతను ప్రదర్శించాయి. అయితే తాజాగా పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కూటమిలో విభేదాలను బయటపెట్టాయి. ఎన్నికల్లో సమన్వయ లోపమే ఓటమికి కారణమంటూ బీజేపీ, శివసేన నేతలు పరస్పరం విమర్శించుకోవడం ప్రారంభించారు. ఇటువంటి సమయంలోనే ముంబైలో జరిగిన 'ది లాఫ్టర్ లైన్స్ ఆఫ్ మహారాష్ట్ర' పుస్తకావిష్కణ కార్యక్రమంలో ఫడ్నవీస్, ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే ఒకే వేదికపై కనిపించారు. ఈ సందర్భంగా ఉద్ధవ్, రాజ్ ఠాక్రేలతో ఫడ్నవీస్ సన్నిహితంగా మాట్లాడటం కొత్త రాజకీయ సమీకరణాలపై ఊహాగానాలకు తెరలేపింది.

పుట్టకోట్ల ప్రాథమిక పాఠశాలలో పొదల తొలగింపు



తూప్రాన్, అక్టోబర్ 30,(మహాప్రభ)
తూప్రాన్ మున్సిపాలిటీలోని నాలుగో వార్డు పరిధిలో ఉన్న పుట్టకోట్ల ప్రాథమిక పాఠశాల ఆవరణలో పెరిగిన చెట్ల పొదలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో నాలుగో వార్డు కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్ చొరవ తీసుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు, చెట్ల పొదలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్, వార్డు ఆఫీసర్ మహేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి, ఆధ్యాత్మికతతోనే సమాజంలో సుఖశాంతులు

-వంటేరు ప్రతాప్ రెడ్డి
-గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్



వర్గల్ అక్టోబర్ 30,(మహాప్రభ)
వర్గల్ మండలం నాచారం గ్రామంలో నిర్వహించిన శ్రీ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన మనిషికి మానసిక ప్రశాంతతను, ధైర్యాన్ని, సానుకూల ఆలోచనలను అందిస్తాయని పేర్కొన్నారు. గ్రామదేవతల ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ భక్తి భావంతో పాటు ఐకమత్యం, సోదరభావంతో ముందుకు సాగాలని, మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని అన్నారు. శ్రీ పెద్దమ్మతల్లి దీవెనలతో గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు కలగాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

పోయిన మొబైల్‌ను బాధితుడికి అప్పగించిన దేవరకద్ర పోలీసులు..

-ఎస్సై భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు



దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 30 మహాప్రభ
దేవరకద్ర: మార్గమధ్యంలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సకాలంలో స్పందించి గుర్తించి బాధితుడికి తిరిగి అందజేసి దేవరకద్ర పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. దేవరకద్ర మండలం జినుగురాల గ్రామానికి చెందిన శివకుమార్ ఫిబ్రవరి 1, 2026న తన గ్రామం నుంచి దేవరకద్రకు వస్తుండగా మార్గమధ్యంలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నారు. దీంతో ఆందోళనకు గురైన ఆయన పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.ఫిర్యాదుపై వెంటనే స్పందించిన దేవరకద్ర ఎస్సై భాస్కర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మొబైల్ ఫోన్‌ను గుర్తించి బాధితుడికి తిరిగి అందజేశారు. పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి అందించిన పోలీసుల తక్షణ స్పందనపై శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు. సమయస్ఫూర్తితో స్పందించి తనకు సహకరించిన ఎస్సై భాస్కర్‌రెడ్డికి, దేవరకద్ర పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నీటి వివాదం.. మహిళపై దాడి, కుటుంబ సభ్యులకు బెదిరింపులు!

మహిళ ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన ఘటన..
నిందితుడిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి విజ్ఞప్తి

శివ్వంపేట అక్టోబర్ 30(మహాప్రభ)
నీళ్లు ఇంటి ముందు నిలిచాయనే చిన్నపాటి వివాదం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసిన ఘటన శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో చోటుచేసుకుంది. శివ్వంపేట ఎస్ ఐ మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వడ్ల వీరమణి (58) ఫిర్యాదు అక్టోబర్ 29న ఉదయం ఇంటి ముందు నీళ్లు చల్లుతున్న సమయంలో ఎదురింటి పక్కన నీళ్లు నిలిచాయనే విషయమై గోత్రాల నాగమణి తనను అసభ్య పదజాలంతో దూషించిందని తెలిపింది. అదే రోజు రాత్రి తన చిన్న కుమారుడు బాలకృష్ణకు ఈ విషయం చెబుతుండగా, నాగమణి కుమారుడు రాజు విని తనను, తన కుమారుడిని దూషించాడని పేర్కొంది. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న ఇటుక రాయితో తనపై విసరగా, అడ్డువచ్చిన తన తమ్ముడు బ్రహ్మచారి ఎడమ చేతికి తగిలి గాయమైందని ఫిర్యాదులో పేర్కొంది. మరుసటి రోజు అక్టోబర్ 30న ఉదయం తన భర్త బయటకు వెళ్తుండగా రాజు అసభ్య పదజాలంతో దూషించాడని, ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించడంతో తనపై అసభ్యకరమైన సైగలు చేస్తూ చెంపలపై చేతితో కొట్టాడని ఆరోపించింది. తన భర్తపై కూడా దాడి చేసి, కుటుంబ సభ్యులందరినీ చంపుతానని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయగా శివ్వంపేట ఎస్ ఐ మధుకర్ రెడ్డి కేసు నమోదు చేసి ధర్యాప్తు ప్రారంభించమని తెలిపారు

పెండింగ్ బిల్లుల కోసం ఫోన్‌కాల్స్ మోత!

-మహారాష్ట్ర బీజేపీ సర్కార్‌కు నిరసన తెలుపనున్న కాంట్రాక్టర్లు
-సీఎం, డిప్యూటీ సీఎంల ఆఫీస్‌లకు మూడ్రోజులు ఫోన్ కాల్స్



ముంబై అక్టోబర్ 30 (మహాప్రభ)
పెండింగ్‌లో ఉన్న వేల కోట్ల రూపాయల బిల్లుల కోసం మహారాష్ట్ర కాంట్రాక్టర్లు నిరసన బాట చేపట్టారు. తమకు చెల్లించాల్సిన 86 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వారు శుక్రవారం నుంచి 'ఫోన్ నిరసన' చేపట్టారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, సునేత్రా పవార్‌లతో పాటు వారి కార్యాలయాలను శుక్రవారం నుంచి ఫోన్‌కాల్స్‌తో హోరెత్తించాలని మహారాష్ట్ర స్టేట్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ (ఎంఎస్‌సీఏ) తమ సభ్యులకు పిలుపునిచ్చింది.శుక్రవారం ఫడ్నవీస్ కార్యాలయానికి, సోమవారం షిండేకు, మంగళవారం పవార్‌లకు ఫోన్లు చేయాలని కోరుతూ వారిరువురి కార్యాలయాల ల్యాండ్ ఫోన్ నెంబర్లను విడుదల చేసింది. మూడు లక్షల మంది కాంట్రాక్టర్లు ముఖ్యమైన మంత్రులకు ఫోన్లు చేసి తమ పెండింగ్ బిల్లులు చెల్లిస్తారా? లేదా? అని నిలదీయాలని కోరింది. చేసిన పనులకు ఏడాదిన్నర నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని, దీని కారణంగా 10 మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఎంఎస్‌సీఏ ఆరోపించింది.

2వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం..

- ర్యాలీని వాయిదా వేయండి..
-సోనియా గాంధీని కోరిన ఢిల్లీ వ్యాపారులు



న్యూఢిల్లీ అక్టోబర్ 30 (మహాప్రభ)
నవంబర్ ఒకటో తేదీన ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ఎత్తును కాంగ్రెస్ పార్టీ ర్యాలీ నిర్వహించనున్నది. ఆ ర్యాలీలో సుమారు 10 లక్షల మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. అయితే ఆ ర్యాలీని వాయిదా వేయాలని ఢిల్లీ వ్యాపారులు(ణవశ్రీష్ట్రఅ ఎఝీఎనవతీం) ఇవాళ కాంగ్రెస్ నేత సోనియా గాంధీని వేడుకున్నారు. దీపావళి సీజన్ షాపింగ్ జరుగుతోంది కాబట్టి , ర్యాలీ వల్ల సుమారు 12వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడే అవకాశం ఉందని, అందుకే ఆ ప్రతిపాదిత ర్యాలీని వాయిదా వేసుకోవాలని సోనియాను ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ కోరింది.ఢిల్లీలో ఆందోళనలు చేయడం వల్ల సుమారు 20 కీలక మార్కెట్లకు నష్టం జరిగే ఛాన్సు ఉన్నట్లు వాణిజ్య సంఘాలు తెలిపాయి. నవంబర్ 11 తర్వాత ర్యాలీ నిర్వహించుకోవాలని, లేదంటే బురారీ గ్రౌండ్‌కు మార్చుకోవాలని వ్యాపారులు కోరారు. రామ్‌లీలా మైదానంలో ర్యాలీ వల్ల పార్కింగ్ సమస్యలు వస్తాయని, దీంతో సుమారు 20 లక్షల మంది వ్యాపారులపై వత్తిడి ఉంటుందని సీటీఐ తన అభ్యర్థనలో పేర్కొన్నది. రామ్‌లీలా మైదానంలో 20 వేల వాహనాలను పార్క్ చేసేంత సామర్థ్యం లేదని, కనీసం 200 పెద్ద బస్సులను ఆక్కడ ఆపలేమని వ్యాపారులు తెలిపారు. మైదానానికి 5 కిలోమీటర్ల విస్తీర్ణంలో సుమారు 20 అతిపెద్ద మార్కెట్లు ఉన్నాయని, పండుగ సీజన్ వేళ ఆ మార్కెట్లలో జరిగే సుమారు 12వేల కోట్ల వ్యాపారం దెబ్బతినే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు చెప్పారు.

ఇజ్రాయెల్‌లో తుది ఫలితాలు వెల్లడి..

- ఏ పార్టీకీ దక్కని మెజారిటీ..
- ప్రభుత్వ ఏర్పాటు అసాధ్యమేనా..!



న్యూఢిల్లీ అక్టోబర్ 30 (మహాప్రభ)
ఇజ్రాయెల్ ఎన్నికల్లో తుది ఫలితాలు వెల్లడయ్యాయి. బుధ, గురువారాల్లో మొత్తం ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. అయితే ఈ ఎన్నికల్లో ఏ కూటమికి, పార్టీకి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 61 సీట్ల ఫుల్ మెజారిటీ రాలేదు. హంగ్ ఏర్పడింది. మొత్తం 120 స్థానాలకుగానూ ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి ప్రధానమంత్రి నెతన్యాహు నేతృత్వంలోని అధికార కూటమికి 53 సీట్లు దక్కాయి. నెతన్యాహుకు చెందిన 'లికుడ్ పార్టీ 27 సీట్లు గెల్చుకోవడం ద్వారా అతిపెద్ద పార్టీగా నిలిచింది.ప్రతిపక్ష కూటమి 48 స్థానాలు దక్కించుకుంది. అరబ్ పార్టీలు అనూహ్యంగా 19 సీట్లు సొంతం చేసుకున్నాయి. చివరగా లెక్కించిన ఇజ్రాయెల్ మిలిటరీ సిబ్బంది, రిజర్వు సైనికులు, దౌత్యవేత్తలు, ఆసుపత్రుల్లో ఉన్న రోగులు, వైద్య సిబ్బంది, ఖైదీల వంటివారు వేసిన 'డబుల్ ఎన్వలప్ బ్యాలెట్స్‌లో నెతన్యాహు కూటమికి సీట్లసంఖ్య పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేశారు. కానీ డబుల్ ఎన్వలప్ బ్యాలెట్లతోనూ సమీకరణాలు ఏమాత్రం మారలేదు. ఇప్పుడు హంగ్ ఏర్పడటంతో ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి నెలకొన్నది. 19 సీట్లు దక్కించుకున్న అరబ్ పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రస్తుతం అధికారంలో ఉన్న రైట్ వింగ్, ప్రతిపక్ష లెఫ్ట్ వింగ్ కూటములు విముఖంగా ఉన్నాయి. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్ష కూటములు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అక్కడి రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇదిలావుంటే ఇజ్రాయెల్ ఎన్నికల్లో విదేశాలు జోక్యం చేసుకున్నాయని ప్రధాని నెతన్యాహు మరోసారి ఆరోపించారు. ఇది 'భూకంపం' వంటి విపత్తు అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు, అంతర్గత భద్రతా విభాగం దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అరబ్ పార్టీలు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డాయని విమర్శించారు. ఇజ్రాయెల్ ఇస్లామీకరణకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం తాము అరబ్ పార్టీలతో చేతులు కలపబోమని స్పష్టంచేశారు.

అమెరికాలో 30 ఎకరాల భూమిపై వివాదం..

-కేసు నెగ్గిన మహాత్మా గాంధీ మనవడి ట్రస్టు



సూరత్ అక్టోబర్ 30 (మహాప్రభ)
మహాత్మా గాంధీ మనవడు కానూ గాంధీకి చెందిన భూమి కేసులో అమెరికా కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఆ భూమిని కబ్జా చేసిన వర్జీనియా నివాసితుడిని అక్కడ నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవాలని కోర్టు ఆదేశించింది. దివంగత జంట కానూ గాందీ, ఆయన భార్య శివా గాంధీ తరపున సూరత్‌కు చెందిన పరిమల్ దేశాయ్ అమెరికా కోర్టులో 30 ఎకరాల స్థలం కోసం పోరాటం చేశారు. వర్జీనియాలోని వారెన్ కౌంటీలో ఉన్న షేనాదోబా నేషనల్ పార్క్ సమీపంలో ఆ స్థలం ఉన్నది. 1987లో కానూ గాంధీ ఆ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆయన తన చివరి దశలో దక్షిణ గుజరాత్‌లో గడిపారు. ఆ సమయంలో ఓ ఛారిటబుల్ ట్రస్టును నమోదు చేసి, దానికి తన ఆస్తులను బదిలీ చేశారు. ఆ ట్రస్టుకు ఇప్పుడు దేశాయ్ మేనేజింగ్ ట్రస్టీగా ఉన్నారు.మెరికాలోని 30 ఎకరాల కేసు గురించి పరిమల్ దేశాయ్ ఓ మీడియాతో వెల్లడించారు. అమెరికా జాతీయుడు గ్రెగరీ బ్లాక్ అనే వ్యక్తి తన ఇంటికి 2025 జనవరి 10న నోటీసు పంపారని, వర్జీనియాలో ఉన్న ఆ భూమి తన పొజిషన్‌లో ఉన్నట్లు ఆ నోటీసులో పేర్కొన్నాడని తెలిపారు. 15 ఏళ్లుగా ఆ స్థలం తన ఆధీనంలో ఉన్నట్లు ఆ వ్యక్తి పేర్కొన్నాడు. అయితే కోర్టులో మాత్రం ఆ విషయాన్ని బ్లాక్ నిరూపించలేకపోయినట్లు పరిమల్ దేశాయ్ మీడియాతో తెలిపారు.

భారత్‌కు 87 పరుగుల భారీ ఓటమి!



క్రీడా విభాగం:
ఐదు టీ20ల సిరీస్‌లో టీమ్‌ఇండియాకు తొలి ఓటమి ఎదురైంది. నాలుగో టీ20లో న్యూజిలాండ్ బ్యాటర్లు గ్లెన్ ఫిలిప్స్, మైకేల్ బ్రేస్‌వెల్ విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో చెలరేగడంతో భారత్ 87 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో భారత్ 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 172 పరుగులకే పరిమితమైంది. ఇప్పటికే తొలి మూడు మ్యాచ్‌ల్లో విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్.. ఈ ఓటమితో 3-1 ఆధిక్యానికి పరిమితమైంది. టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. టిమ్ సీఫర్ట్ (3), డారిల్ మిచెల్ (24) త్వరగా వెనుదిరిగారు. మరో ఓపెనర్ ఫిన్ అలెన్ 31 పరుగులతో వేగంగా ఆడాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 49 బంతుల్లో ఆరు ఫోర్లు, పది సిక్సర్లతో 107 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతడికి మైకేల్ బ్రేస్‌వెల్ అండగా నిలిచాడు. బ్రేస్‌వెల్ కేవలం 25 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఆరు సిక్సర్లతో 65 పరుగులు సాధించాడు. వీరిద్దరి ధాటికి న్యూజిలాండ్ భారీ స్కోరు నమోదు చేసింది.260 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు తొలి ఓవర్‌లోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ పరుగులేమీ చేయకుండానే ఔటయ్యారు. దీంతో టీమ్‌ఇండియా తీవ్ర ఒత్తిడిలో పడింది. అభిషేక్ శర్మ (27), శ్రేయస్ అయ్యర్ (6) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. నితీశ్ కుమార్ రెడ్డి (5), అక్షర్ పటేల్ (3) నిరాశపరచడంతో భారత్ కష్టాల్లో పడింది. ఓ వైపు వికెట్లు పడుతున్నా తిలక్ వర్మ పోరాటం కొనసాగించాడు. 35 బంతుల్లో 35 పరుగులు చేశాడు. నామన్ ధీర్ 13 బంతుల్లో 28 పరుగులతో వేగంగా ఆడాడు. అయితే భారీ లక్ష్యం ముందు ఈ ప్రయత్నాలు సరిపోలేదు. కీలక బ్యాటర్లు వరుసగా పెవిలియన్ చేరడంతో భారత్ విజయావకాశాలు దెబ్బతిన్నాయి. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ నాలుగు వికెట్లు పడగొట్టి భారత బ్యాటింగ్ పతనాన్ని శాసించగా, మిచెల్ సాంట్నర్ రెండు వికెట్లు తీశాడు. ఈ విజయంతో న్యూజిలాండ్ సిరీస్‌లో తొలి గెలుపును అందుకుంది. ఇప్పటికే మూడు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ను ఖరారు చేసుకున్న భారత్ 3-1తో ఆధిక్యంలో కొనసాగుతోంది. చివరి టీ20లో గెలిచి సిరీస్‌ను 4-1తో ముగించాలని టీమ్‌ఇండియా లక్ష్యంగా పెట్టుకుంది.

మళ్లీ పగ్గాలిస్తే యూపీలో యూసీసీ అమలు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే విజయం
ధీమా వ్యక్తం చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
ప్రతిపక్షాల ఆరోపణలపై సమాజ్‌వాదీ పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు
రామమందిరం, ఓటర్ల జాబితా అంశాలపై ప్రస్తావన
యూపీలో బీజేపీ ప్రభుత్వాన్ని కదిలించలేరన్న అమిత్ షా



లిలక్నో:
ఉత్తరప్రదేశ్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)ని అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం తెలిపారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారంనాడిక్కడ జరిగిన బీజేపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో రామ మందిరం అంశం, ఓటర్ల జాబితాలో అవకతవకల ఆరోపణలపై సమాజ్వాదీ పార్టీతోపాటు ఇతర ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్లో బీజేపీ ప్రభుత్వాన్ని కదిలించలేరని, ప్రభుత్వం అక్కడ తన స్థానాన్ని బలంగా నిలబెట్టుకుందని షా అన్నారు. ఈసారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఉత్తరప్రదేశ్లో యుసిసి అమలు చేస్తామని, ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో యుసిసి అమల్లో ఉందని అన్నారు. డాక్టర్ రామ్ మనోహర్ లోహియా జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన రోజంతా సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి షా ప్రారంభించారు. పార్టీ సిద్ధాంతకర్తలు శ్యామ ప్రసాద్ ముఖర్జీ, దీన్దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జనవరి 25 నుంచి జనగణన

న్యూఢిల్లీ:
ఎన్నికలు జరిగే ప్రాంతాలు, మంచు ప్రభావిత ప్రాంతాలు మినహా దేశవ్యాప్తంగా జనగణనను (పాపులేషన్ సెన్సస్) 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్నట్లు జనాభా లెక్కల కమిషనర్ శుక్రవారం ప్రకటించారు. అధికారిక నోటిఫికేషన్ ప్రకారం, జనాభా లెక్కలకు ప్రామాణిక తేదీగా 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను (00:00) నిర్ణయించారు. మణిపూర్ (తదుపరి ప్రకటన వరకు), గోవా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, లద్దాఖ్, హిమాచల్ప్రదేశ్, జమ్ముకశ్మీర్లో మంచుతో ప్రభావితమైన ఏక కాలంలో లెక్కలు నిర్వహించలేని ప్రాంతాలు మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కలు నిర్వహించనునట్లు భారత రిజిస్ట్రార్ జనరల్, జనాభా లెక్కల కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ జారీ చేసిన నోటిఫికేషన్లో పేర్కొన్నారు. జనాభా లెక్కల సవరణ దశను 2027 మార్చి 1 నుంచి 5 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటింటి జనాభా లెక్కింపు ప్రారంభానికి ముందు 2027 జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని నోటిఫికేషన్లో పేర్కొన్నారు.

బీజేపీతో పొత్తుకు బీఆర్ఎస్ ఆరాటం

-చంద్రబాబును పొగడటం వెనుక రాజకీయ వ్యూహం
-గతంలో విమర్శలు.. ఇప్పుడు ప్రశంసలు ఎందుకని ప్రశ్న
-బీజేపీతో సయోధ్య కోసమే ఈ వైఖరని ఆరోపణ
-కాంగ్రెస్‌పై విమర్శలు.. బీజేపీ, టీడీపీలపై మౌనం
-బీఆర్ఎస్ సోషల్ మీడియా తీరుపై మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు
-ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించే ధైర్యం ఉందా?
-బావాబామ్మర్దుల చీకటి ఒప్పందాలను ఆధారాలతో బయటపెడతాం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి
బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు ఆరాటపడుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబును తీవ్రంగా విమర్శించిన బీఆర్ఎస్ నేతలే ఇప్పుడు ఆయనను పొగుడుతూ ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీజేపీతో పొత్తు పెట్టుకునే రాజకీయ వ్యూహంలో భాగంగానే ఈ సయోధ్య ప్రయత్నాలు సాగుతున్నాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌పై నిత్యం విమర్శలు చేసే బీఆర్ఎస్ సోషల్ మీడియా, బీజేపీ, టీడీపీలను మాత్రం ప్రశ్నించకపోవడం వెనుక రహస్య ఒప్పందం ఉందని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులకు నిజంగా రాజకీయ ధైర్యం ఉంటే ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్న చీకటి రాజకీయ ఒప్పందాలను తగిన ఆధారాలతో ప్రజల ముందు బయటపెడతామని స్పష్టం చేశారు.

మియాపూర్ భూములు పేదలకే!

మొదటి తరువాయి

సీఎం తెలిపారు. మియాపూర్ భూముల విషయంలో గత మూడేళ్లుగా న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతూ బలమైన వాదనలు వినిపించామని చెప్పారు. తీర్పు వెలువడిన వెంటనే భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. అవసరమైతే ఈ భూములను వేలం వేసి, వచ్చే నిధులను దళితులు, బహుజనులు, పేదల అభివృద్ధికి ఖర్చు చేస్తామని ప్రకటించారు. మియాపూర్ భూముల వ్యవహారంలో గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు తదితరుల పాత్రపై సీఎం ప్రస్తావించారు. కొందరు అధికారులు, ప్రైవేటు వ్యక్తులు కలిసి ప్రభుత్వ భూములను కాజేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో గతంలో కొందరు అధికారులు అరెస్టయ్యారని గుర్తుచేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల వెనుక ఎవరున్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని విలువైన ప్రభుత్వ భూములను గతంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నాలు జరిగాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఐఎంజీ భూముల వ్యవహారంలోనూ న్యాయపోరాటం చేసి ప్రభుత్వ ఆస్తులను కాపాడినట్లు తెలిపారు. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలు, మామిడిపల్లిలో 450 ఎకరాల భూముల పరిరక్షణకు ప్రభుత్వం పోరాడిందన్నారు. హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ కలాన్‌లోని 140 ఎకరాల భూమిని కూడా కాపాడినట్లు చెప్పారు. శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లో రూ.3,600 కోట్ల విలువైన 36 ఎకరాల భూమిని కాపాడుకున్నామని సీఎం తెలిపారు. గండిపేట మండలం మంచిరేవులలోని ప్రభుత్వ భూముల విషయంలోనూ న్యాయపోరాటం చేశామని పేర్కొన్నారు. అక్కడ 50 ఎకరాలను యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కోసం కేటాయించినట్లు వివరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రూ.400 కోట్ల విలువైన 106 ఎకరాల అటవీ భూమిని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 600 ఎకరాల అటవీ భూమిని న్యాయస్థానాల్లో పోరాడి కాపాడినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను సీఎం ఖండించారు. భూ ఆక్రమణలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చినా బీఆర్ఎస్ నాయకులు స్పందించకపోవడంపై ప్రశ్నలు సంధించారు. పద్మాలయ స్టూడియో తదితర భూముల వ్యవహారాలను ప్రస్తావిస్తూ, గతంలో అధికారంలో ఉన్నప్పుడు వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని నిలదీశారు. భూముల విక్రయం ద్వారా సమకూరే నిధులను ఎలా వినియోగించాలనే అంశంపై వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్య, వైద్యం, పేదల సంక్షేమం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు వినియోగించేలా ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మామ హనుమంతరావుకు సంబంధించిన భూముల సర్వేను అడ్డుకుంటున్నారంటూ కూడా సీఎం ఆరోపించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గబోమని, ప్రజా ఆస్తులను కాపాడి ప్రజల ప్రయోజనాలకే వినియోగిస్తామని స్పష్టం చేశారు.

సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

మొదటి తరువాయి

ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 చొప్పున దీపావళి బోనస్ చెల్లించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న సింగరేణి సంస్థ అభివృద్ధి విస్తరణకు ప్రజాప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. లాభాల వాటా కింద ఈ నెలలో దాదాపు రూ.600 కోట్లు చెల్లించగా.. తాజాగా రూ.419 కోట్ల దీపావళి బోనస్ చెల్లించబోతున్నట్లు తెలిపారు. బొగ్గు రంగంలో పోటీని అధిగమించేం దుకు బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే ప్రయత్నం చేయాలన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆదేశాలపై సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి సంబంధిత పర్సనల్, ఫైనాన్సు అధికారులతో మాట్లాడి నవంబర్ 5వ తేదీన ఈ దీపావళి బోనస్‌ను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో చెల్లింపునకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ బోనస్ కేవలం ఎన్.సీ.డబ్ల్యూ.ఎ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది తెలిపారు. ఇది అధికారులకు వర్తించదని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో భూగర్భ గనుల విభాగంలో 190 పని దినాలు, ఓపెన్ కాస్ట్, సర్వేస్ విభాగాలలో 240 పని దినాలు పూర్తి చేసిన కార్మికులకు పూర్తిస్థాయిలో బోనస్ అందుతుందని అంతకంటే తక్కువ పని దినాల హాజరు కలవారికి వారు చేసిన కాలానికి నిష్పత్తి ప్రకారం బోనస్‌ను లెక్క కట్టి చెల్లించనున్నారు. అయితే ఈ బోనస్ పొందడానికి కనీస అర్హత గాగత ఆర్థిక సంవత్సరంలో ఏ కార్మికుడైనా కనీసం 30 రోజులు పని చేసి ఉండాలని నిర్ణయించారు. మొత్తం మీద చూస్తే సుమారు 38,000 మంది ఉద్యోగులకు ఈ బోనస్ వర్తించనుంది. నెల రోజుల వ్యవధిలోనే దసరా, దీపావళి బోనస్‌ల రూపంలో సగటున దాదాపు 2,65,000 రూపాయలను కార్మికులు అందుకోబోతున్నారు. సింగరేణి యాజమాన్యం ఈ రెండు బోనస్ లతో సుమారు రూ.1,020 కోట్ల రూపాయలను కార్మికులకు చెల్లించింది. ఈ నేపథ్యంలో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి సింగరేణి ఉద్యోగులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్మికులు బోనస్‌ల సొమ్మును తమ కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని, అవకాశం ఉంటే పొదుపు చేసుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ పండుగల స్ఫూర్తితో ఉత్సాహంగా పనిచేయాలని గనుల వారిగా, శాఖల వారిగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని కోరారు.

భూటాన్‌లో హైఅలర్ట్!



అంతర్జాతీయ డెస్క్
భూటాన్‌లోని గాసా జిల్లాలో షింటాఫు హిమానీనద సరస్సు ఉప్పొంగడంతో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ పరిణామంతో భారత్‌లోని పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. గురువారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనలో గాసా జిల్లాలో మోచు నది ఒడ్డున ఉన్న ప్రసిద్ధ సహజ వేడినీటి బుగ్గ గాసా త్సాచు వద్ద సౌకర్యాలు పూర్తిగా కొట్టుకుపోయాయి. అయితే ముందుగానే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించడంతో ప్రాణనష్టం తప్పింది. మోచు నది ఎగువ ప్రాంతంలో ఉన్న షింటాఫు సరస్సు భూటాన్‌లో ప్రమాదకరమైన హిమానీనద సరస్సుల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. గతంలోనూ ఈ ప్రాంతంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. 2021 ఆగస్టు 26న మోచు నది ఉప్పొంగడంతో గాసా త్సాచు ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. తాజాగా పునాఖా జోంగ్‌కు సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని కబేసా గెవాగ్‌లో శ్రీగాంగ్ ప్రాంతాన్ని వరదనీరు దాటినట్లు సమాచారం. భూటాన్ సరిహద్దు ప్రాంతాల్లో వరద ముప్పు నేపథ్యంలో భారత్‌లోని పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తం చేసింది. అస్సాంలోని ధుబ్రి, పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ కొండ ప్రాంతాలతోపాటు అలీపుర్‌దువార్, జల్‌పాయిగురి జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశ్చిమబెంగాల్‌లోని కూచ్‌బెహార్ జిల్లాలో సంకోష్ నది ఒడ్డున నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరికలు జారీ చేశారు. వరద పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తూ, ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం

మొదటి తరువాయి

తరఫున అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడంలో ఇది చారిత్రాత్మక విజయమని అభివర్ణించారు. ఢిల్లీలో చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ కాంగ్రెస్ నుంచి మండల, బ్లాక్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లు సహా పలువురు ముఖ్య నాయకులు తరలివెళ్తున్నారని వెల్లడించారు. ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తోందన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపై స్పందిస్తూ.. దేశ హోంమంత్రిగా ఆయన నగరానికి రావడంపై అభ్యంతరం లేదని, అయితే తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు ఉన్నాయని పొన్నం పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు, అమరవీరుల త్యాగాలపై గతంలో పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలకు అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్, ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితులు, చైనా సరిహద్దు సమస్యలు వంటి కీలక అంశాలను పక్కనపెట్టి, ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసం పర్యటిస్తున్నారని విమర్శించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు అధికారికంగా లేఖ రాస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. బీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంతోపాటు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావాలంటే కులాల వారీగా జనాభా గణాంకాలు అవసరమని చెప్పారు. పశువులు, గొర్రెల లెక్కలు తీస్తున్న కేంద్ర ప్రభుత్వం కోట్లాది మంది బీసీల జనాభా లెక్కలను ఎందుకు సేకరించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ బీసీ నాయకులు లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్‌లకు చిత్తశుద్ధి ఉంటే జాతీయ జనగణనలో కులగణనను చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు

విభేదాలొస్తే అత్యాచారం అనలేం!



న్యూఢిల్లీ:
పరస్పర సమ్మతితో కొనసాగిన బంధంలో విభేదాలు ఏర్పడినంత మాత్రాన, గతంలో ఉన్న సాన్నిహిత్యాన్ని అత్యాచారంగా పరిగణించలేమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సంబంధాలు విఫలమైన తర్వాత వాటిని క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. అత్యాచారం, మోసం వంటి ఆరోపణల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. కేరళకు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన అత్యాచారం, మోసం కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సంబంధం సజావుగా కొనసాగుతున్న సమయంలో పరస్పర అంగీకారంతో ఏర్పడిన సాన్నిహిత్యాన్ని, ఆ బంధం విచ్ఛిన్నమైన తర్వాత మాత్రమే అత్యాచారంగా పరిగణించలేమని ధర్మాసనం పేర్కొన్నట్లు కథనం తెలిపింది. పరస్పర సమ్మతితో ఉన్న సంబంధాన్ని కేవలం విభేదాలు తలెత్తాయనే కారణంతో నేరంగా పరిగణించి, ఒక వ్యక్తి స్వేచ్ఛ, గౌరవానికి భంగం కలిగించే చర్యలు తీసుకోలేమని వ్యాఖ్యానించింది. అయితే, సమ్మతి లేకుండా జరిగిన లైంగిక చర్యలు లేదా మోసానికి సంబంధించిన ఆరోపణలను వాటి వాస్తవాల ఆధారంగా విడివిడిగా పరిశీలించాల్సి ఉంటుందని ఈ సందర్భంలో గుర్తించాలి. ఈ కేసులో బాధితురాలు తనకు ఇదివరకే వివాహమైన విషయాన్ని దాచిపెట్టి నిందితుడు రెండో వివాహం చేసుకున్నాడని ఆరోపించారు. ఆ విషయం తెలిసిన తర్వాత అతడి నుంచి విడిపోయినట్లు తెలిపారు. తనను మోసం చేసి రెండో పెళ్లి చేసుకున్నాడని పేర్కొంటూ అత్యాచారం, మోసం, నమ్మకద్రోహం ఆరోపణలతో ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం సంబంధాల వైఫల్యాన్ని, క్రిమినల్ నేరాలకు సంబంధించిన ఆరోపణలను ఒకే విధంగా చూడకూడదని అభిప్రాయపడింది

దేశం కష్టాల్లో ఉంటే విపక్షాలకు సంతోషం!

బనస్కాంత, గుజరాత్
దేశం అంతర్జాతీయ సంక్షోభాలను ఎదుర్కొంటున్న సమయంలో ప్రతిపక్షాలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించేలా వ్యవహరిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా విమర్శించారు. ఇరాన్--అమెరికా మధ్య ఉద్రిక్తతలతో ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఎరువులు, గ్యాస్ కొరతపై వదంతులు వ్యాప్తి చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ప్రజలంతా కృషి చేస్తుంటే, కొన్ని రాజకీయ వర్గాలు మాత్రం దేశం ఇబ్బందుల్లో పడాలని కోరుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. సంక్షోభ పరిస్థితుల్లోనూ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని మండిపడ్డారు. గుజరాత్‌లోని బనస్కాంతలో నిర్వహించిన కార్యక్రమంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడత నిధులను విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజలు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుంటే, కొన్ని రాజకీయ పార్టీలు దేశ ప్రగతిపై అసంతృప్తితో ఉన్నాయని మోదీ విమర్శించారు. అంతర్జాతీయ పరిణామాల కారణంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పుడు ప్రజలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందని పేర్కొన్నారు. అయితే ఎరువులు, వంటగ్యాస్ కొరత ఏర్పడుతుందంటూ వదంతులు వ్యాప్తి చేయడం ద్వారా ప్రజల్లో ఆందోళన కలిగించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రధాని మోదీని రాజకీయంగా ఇబ్బందుల్లోకి నెట్టాలనే ఉద్దేశంతోనే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని హితవు పలికారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయంగా ఎరువుల ధరలు పెరుగుతున్నప్పటికీ, ఆ భారాన్ని భారత రైతులపై పడనివ్వబోమని ప్రధాని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ పెట్టుబడి ఖర్చులకు కొంతమేర తోడ్పాటు అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడత కింద దేశవ్యాప్తంగా సుమారు రూ.19 వేల కోట్ల నిధులను ప్రధాని విడుదల చేశారు

సైబరాబాద్ అభివృద్ధికి సరికొత్త ముందడుగు.. 'సైబరాబాద్ మూవ్స్'!





-ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు వినూత్న కార్యాచరణ..

-ప్రజల భాగస్వామ్యంతో సమస్యలకు పరిష్కారం

-మున్సిపల్, పోలీస్ శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యక్రమం..

-ఆలోచనలు, సలహాలకు ప్రజలకు ఆహ్వానం

సైబరాబాద్,(అక్టోబర్ 30) మహా ప్రభ

శరవేగంగా విస్తరిస్తున్న సైబరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు కనుగొనడంతో పాటు నగరాన్ని మరింత సౌకర్యవంతంగా, కాలుష్య రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సైబరాబాద్ పోలీస్, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా 'సైబరాబాద్ మూవ్స్ -- కమ్ మేక్ యువర్ మూవ్' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. నగర అభివృద్ధిలో ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు, కార్పొరేట్ సంస్థలు, సాంకేతిక నిపుణులు, విద్యాసంస్థలను భాగస్వాములుగా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. కేవలం ట్రాఫిక్ నియంత్రణకే పరిమితం కాకుండా, భవిష్యత్తు నగర రవాణా వ్యవస్థను మెరుగుపరిచేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించేందుకు ఈ వేదికను ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం సైబరాబాద్ పరిధిలో ఐటీ సంస్థలు, పారిశ్రామిక కేంద్రాలు, వాణిజ్య సముదాయాలు, నివాస ప్రాంతాలు వేగంగా విస్తరిస్తున్నాయి. దీంతో ప్రతిరోజూ రోడ్లపై వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఐటీ కారిడార్లు, ప్రధాన రహదారులు, కార్యాలయాల సముదాయాల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ ట్రాఫిక్ నియంత్రణ పద్ధతులతో పాటు ఆధునిక సాంకేతికత, ప్రజల సూచనలు, సమర్థవంతమైన రోడ్ ఇంజినీరింగ్ ఆధారంగా పరిష్కారాలు రూపొందించేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు.

ప్రజల భాగస్వామ్యమే అభివృద్ధికి కీలకం: కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన

ఈ సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర అభివృద్ధిలో సైబరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందని, నగరానికి గ్రోత్ ఇంజిన్‌లా నిలుస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న వారిలో సగం మంది సైబరాబాద్ పరిధిలోనే ఉన్నారని, ఇంత పెద్ద జనాభాకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ, మెరుగైన ప్రజా సౌకర్యాలు కల్పించడం తమ బాధ్యత అని తెలిపారు.నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కేవలం ప్రస్తుత సమస్యలకే పరిష్కారాలు చూపడం కాకుండా, భవిష్యత్తులో ఎదురయ్యే అవసరాలను ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వ శాఖలు, ఇతర భాగస్వామ్య సంస్థలను కలుపుకొని ముందుకు వెళ్తామని వెల్లడించారు.

ప్రజలను కేవలం ప్రభుత్వ సేవలను పొందేవారిగా కాకుండా నగర అభివృద్ధిలో క్రియాశీల భాగస్వాములుగా చూడాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను ప్రజల నుంచే తెలుసుకుని, వారి సూచనలు, సలహాల ఆధారంగా ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను రూపొందిస్తామని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి వినూత్న ఆలోచనలు: సీపీ డాక్టర్ ఎం. రమేష్

ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ పెరుగుతూ ప్రజల ప్రయాణ సమయాన్ని, జీవన ప్రమాణాలను ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. ప్రతిరోజూ 2 వేలకు పైగా కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తుండటం ట్రాఫిక్ నిర్వహణకు పెద్ద సవాలుగా మారిందన్నారు.ట్రాఫిక్ సమస్యలను కేవలం పోలీస్ శాఖ ఒక్కటే పరిష్కరించడం సాధ్యం కాదని, మున్సిపల్ శాఖ, రహదారుల నిర్మాణ సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు.

ఇందులో భాగంగా 'మొబిలిటీ డేటా జామ్' కార్యక్రమాన్ని చేపట్టామని, నగర రవాణా వ్యవస్థలో ఎదురవుతున్న సమస్యలపై వినూత్న ఆలోచనలు, సాంకేతిక పరిష్కారాలను ఆహ్వానిస్తున్నామని చెప్పారు.

ఐటీ కారిడార్లపై ప్రత్యేక దృష్టి

సైబరాబాద్ పరిధిలోని రహేజా మైండ్‌స్పేస్ వంటి ప్రధాన ఐటీ కేంద్రాల్లో లక్ష మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని సీపీ రమేష్ గుర్తుచేశారు. ఇలాంటి ప్రాంతాల్లో ఉద్యోగుల రాకపోకలు, వాహనాల రద్దీ, పార్కింగ్ సమస్యలు, రహదారుల వినియోగం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి పరిష్కారాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వ శాఖలతో పాటు ఐటీ సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, రవాణా రంగ నిపుణులు కలిసి పనిచేస్తే ట్రాఫిక్ సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు.

టీ-హబ్ వేదికగా ఆవిష్కరణలకు ఆహ్వానం

ఈ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 26,27,28 మూడు రోజుల పాటు టీ-హబ్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీపీ తెలిపారు. ట్రాఫిక్, మొబిలిటీ, రోడ్ ఇంజినీరింగ్, పట్టణ రవాణా రంగాల్లో ఆసక్తి ఉన్నవారు రిజిస్ట్రేషన్ చేసుకుని తమ ఆలోచనలు, సూచనలు అందించవచ్చని పేర్కొన్నారు.ప్రజల నుంచి వచ్చే ఆలోచనల్లో ఆచరణ సాధ్యమైన వాటిని గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవడమే లక్ష్యమని వివరించారు.

కాలుష్య నియంత్రణకు కూడా ప్రాధాన్యత

'సైబరాబాద్ మూవ్స్' కార్యక్రమం కేవలం ట్రాఫిక్ రద్దీ తగ్గించడానికే పరిమితం కాదని, నగరంలో శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యాన్ని తగ్గించే వినూత్న పరిష్కారాలను కూడా ప్రోత్సహిస్తామని అధికారులు తెలిపారు. ప్రజలకు మెరుగైన ప్రయాణ అనుభవం కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఆలోచనలను ప్రోత్సహించనున్నట్లు వెల్లడించారు.

ప్రజల ఆలోచనలతోనే భవిష్యత్తు సైబరాబాద్

మొత్తంగా 'సైబరాబాద్ మూవ్స్ -- కమ్ మేక్ యువర్ మూవ్' కార్యక్రమం నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యానికి కొత్త వేదికగా నిలవనుంది. ట్రాఫిక్ సమస్యలను గుర్తించడం నుంచి పరిష్కారాలను రూపొందించడం వరకు ప్రజలు, ప్రభుత్వ శాఖలు, కార్పొరేట్ సంస్థలు ఒకే వేదికపైకి రావడం ఈ కార్యక్రమంలోని ప్రధాన ప్రత్యేకత.ప్రజల సూచనలకు ప్రాధాన్యతనిస్తూ, వినూత్న ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకొస్తే సైబరాబాద్‌ను మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన, పర్యావరణహితమైన నగరంగా తీర్చిదిద్దే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు.

డాక్టర్ చొల్లటి భాస్కరాచారి, ఆ మంచ అంజయ్య సంతాప సభ

-వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించిన బిసి సంఘం



దేవరకొండ అక్టోబర్ 30 (మహాప్రభ)

దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ డాక్టర్ చొల్లేటి భాస్కరాచారి, ఆమంచ అంజయ్య లకు సంతాప సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంతాప సభలో చాలామంది బీసీ ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు , వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొని వారు చేసినటువంటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ భాస్కరాచారి, ఆమంచ అంజయ్య ఇరువురు సమాజంలో ఉన్నతమైన సేవలందించారని వారు కుల సంఘాల్లోనూ, బీసీ ఉద్యమాల్లోనూ, సామాజిక ఉద్యమాలను సామాజిక కోణంలో ఎంతోమంది ప్రజలకు మేలు చేశారని ఆయన స్ఫూర్తితో ప్రజలు సేవ చేయాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎట్టి పరిస్థితుల్లోనూ సంఘం సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాసోజు వెంకటాచారి, కూరెళ్ళ కృష్ణ చారి, ఆర్ కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, బొమ్మిడి వెంకటయ్య ,రాజపేట శ్రీను, భూషరాజ రాములు, కొండూరు శ్రీనివాస్ చారి, డాక్టర్ భాషా చౌహన్, గౌరోజు బ్రహ్మచారి, నీల రవికుమార్ మాకం రమేష్, శ్రీరామదాసు శ్రీనివాస్ చారి, చేపూరి భీష్మ చారి, శేఖర్ ,వారి కుటుంబ సభ్యులు సొల్లేటి కుమారస్వామి చొల్లేటి మణికంఠ ,వారీ సతీమణి, ఆమంచ కిషోర్ ,పగిళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనపై సమగ్ర విచారణ జరపాలి --- ఎస్ఎఫ్ఐ



దేవరకొండ అక్టోబర్ 30(మహాప్రభ)

దేవరకొండ పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల (బాలికల)లో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న అనంతరం కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ ఈ ఘటనపై అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం, వసతి,భద్రత, మానసిక ప్రశాంతత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విద్యార్థినులు ఎలాంటి ఒత్తిళ్లకు,ఇబ్బందులకు గురవుతున్నారో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా విచారణ చేపట్టాలని కోరారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులను పూర్తిస్థాయిలో వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులెవరైనా ఉంటే విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బాధిత విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఆమెకు అవసరమైన మానసిక ధైర్యం,కౌన్సెలింగ్ కల్పించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గురుకుల కళాశాలల్లో విద్యార్థినుల సమస్యలను తెలుసుకునేందుకు ప్రత్యేక ఫిర్యాదుల వ్యవస్థ ఏర్పాటు చేయాలని, విద్యార్థినుల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని,సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ , ఏఐఎస్ఎఫ్, టిఆర్ఎస్వి నాయకులు నేతళ్ళ జయరాం, వెన్నుపోతుల పరమేష్ చలపతి,బొడ్డు పెళ్లి కృష్ణ,ప్రశాంత్, శివకుమార్, శంషుద్దీన్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

భూత్పూర్‌ను కరువు మండలంగా ప్రకటించాలి..

- రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

-బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చౌరస్తాలో ధర్నా..

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్



ఎవరు కదరా నియోజకవర్గ అక్టోబర్ 30 మహా ప్రభ

దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మండలం: వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. భూత్పూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం అందించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.అనంతరం బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. భూత్పూర్ మండలంలో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. భూత్పూర్ మండలంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను కరువు ప్రాంతంగా గుర్తించి, బాధిత రైతులకు తక్షణమే ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.యాసంగి సాగు చేయొద్దని, నీళ్లు, విద్యుత్ అడగొద్దని ప్రభుత్వం చెబుతుంటే రైతులు వ్యవసాయం ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. సాగు వద్దంటే రైతుల జీవనోపాధికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. కృష్ణా జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, జూరాల, కేఎల్ఐ ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు.ఇది కేవలం ప్రకృతి వైపరీత్యం వల్ల ఏర్పడిన పరిస్థితి మాత్రమే కాదని, ప్రభుత్వ వైఫల్యాలు కూడా రైతుల కష్టాలకు కారణమయ్యాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పెద్ద మనసుతో తక్షణమే పరిహారం ప్రకటించాలని ఆల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

గురకొండలో ఉపాధి హామీ పనుల పరిశీలన.. కూలీలకు వేతనాలు, వసతులపై ఆరా





దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 30 మహా ప్రభ

దేవరకద్ర మండలంగురకొండ: గ్రామంలోని 53వ సర్వే నంబర్ పరిధిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శ్రీనివాసరావు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి కూలి డబ్బులు సక్రమంగా అందుతున్నాయా? పనులకు అవసరమైన గడ్డపారలు, గంపలు, పారలు అందుబాటులో ఉన్నాయా? అని ఆరా తీశారు. కూలీలు వేతనాలు సక్రమంగా అందుతున్నాయని, పనిముట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులకు తెలిపారు. అనంతరం గ్రామంలోని స్మశానవాటిక వద్ద ఉన్న బోరును పరిశీలించారు. బోరులో నీటి నిల్వలు తగ్గిపోవడంతో నీటి లభ్యతను పెంపొందించే లక్ష్యంతో రీఛార్జ్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ దాసరి చిన్నమ్మ ఉషనప్ప స్థలాన్ని పరిశీలించి మార్కింగ్ ఇచ్చారు. అనంతరం బోరు రీఛార్జ్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి చిన్నమ్మ ఉషనప్ప, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

---జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



మెదక్ జిల్లా -30అక్టోబర్ (మహాప్రభ).

నర్సాపూర్ ఏరియా ఆసుపత్రినీ డి సి హెచ్ శివ దయాలతో జిల్లా కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది అందుబాటు, విధుల హాజరుపై ఆరా తీశారు.సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. విధులకు సమయపాలనతో హాజరై రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రణాళికలు రూపొందించి అందుకు అనుగుణంగా రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ వంశి, డాక్టర్లు మీర్జా , గైనకాలజిస్ట్. ప్రేమ వర్ధిని,డాక్టర్ దుర్గా అనస్థీటిస్ట్ సివిల్ సర్జన్ రాము, వసుధ, వీణా ప్రియదర్శిని అన్ని నర్సింగ్ అధికారులు ల్యాబ్ టెక్నీషియన్లు సిబ్బంది పాల్గొన్నారు.

రామాయంపేటలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రక్తదాన శిబిరం, ఉచిత మెగా వైద్య శిబిరం



రామాయంపేట అక్టోబర్ 30 మహాప్రభ
విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని రామాయంపేట పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో నేడు మెగా వైద్య శిబిరం మరియు రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస్ రావు, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, రామాయంపేట సీఐ సైదా, ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.
తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం
తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు. యువత, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. పోలీసుల సేవలను, త్యాగాలను స్మరించుకుంటూ, సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని స్థానికులు కొనియాడారు.

నీట మునిగి వ్యక్తి మృతి ..





పాపన్నపేట, అక్టోబర్30(మహాప్రభ)
ప్రమాదవశాత్తూ నీట మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన చెందిన సంఘటన ఏడుపాయల చెక్ డ్యాంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...పాపన్నపేట గ్రామానికి చెందిన ఆకుల క్రిష్ణ (40) కూలీ పనులు చేస్తూ జీవితం గడుపుతున్నాడు. గురువారం రాత్రి సమయంలో ఏడుపాయల వద్ద ఉన్న తన తల్లి అంజమ్మ వద్దకు వెళ్లాడు.శుక్రవారం ఉదయం స్నానం చేసేందుకు ఏడుపాయల చెక్ డ్యాం వద్దకు వెళ్లి చెక్ డ్యాంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో గాలించింగ క్రిష్ణ మృతదేహం లభ్యమైంది.మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పౌర హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

-- పిల్లుట్లలో అధికారుల సూచన



శివ్వంపేట అక్టోబర్ 30(మహాప్రభ)
శివ్వంపేట మండల పిల్లుట్ల గ్రామంలో సర్పంచ్ బర్ర మురళీ గౌడ్ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరుల హక్కులు, రాజ్యాంగం కల్పించిన చట్టాలు, సమానత్వం, కులవివక్ష నిర్మూలన వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి వివక్షకు తావులేకుండా సమానత్వ భావనతో ముందుకు సాగాలని అధికారులు సూచించారు. పౌరుల హక్కులను కాపాడుకోవడంతో పాటు బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్, శివ్వంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి , ఆర్ ఐ నిరంజన్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ కి ఏబీవీపీ వినతి పత్రం



దేవరకొండ అక్టోబర్ 30(మహాప్రభ
ఏబీవీపీ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం దేవరకొండ మండలం కొండ భీమనపల్లి పరిధిలో ఉన్నటువంటి పెంచికల్పహాడ్ టి టి డిబ్ల ఆర్ పాఠశాల గర్ల్స్ హాస్టల్లో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యా యత్నం చేసుకోవడం పై దీనికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ కి ఎబివిపి కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థినిల ఆత్మహత్యాయత్నానికి కారకులైన ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగించాలి

-ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

-బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ



దేవరకొండ అక్టోబర్ 30(మహాప్రభ)
గురుకుల పాఠశాలలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి అని దేవరకొండ బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ కోరారు.దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినిని శుక్రవారం బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ పరామర్శించారు.అనంతరం ఈ ఘటనకు నిరసనగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపించాలని, ఘటనకు బాధ్యులుగా తేలిన ఉపాధ్యాయులను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆర్సీఓ పర్యవేక్షణ లోపం, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు.విద్యార్థుల భద్రతను పట్టించుకోకుండా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళనకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి లేకపోవడంతో విద్యావ్యవస్థపై సమర్థవంతమైన పర్యవేక్షణ కొరవడిందని విమర్శించారు.రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గురుకుల విద్యావ్యవస్థకు అధిక ప్రాధాన్యతనిచ్చి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించామని గుర్తుచేశారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి గురుకుల పాఠశాలలను క్షేత్రస్థాయిలో సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవాలని కోరారు.ఈ ఘటనపై తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు పాత్లావత్ లక్ష్మణ్, చాట్ల ప్రశాంత్,ముదిగొండ హరిదాస్,తదితరులు పాల్గొన్నారు

సైబర్ నేరాలపై అవగాహనకు మెదక్‌లో ఫ్లాష్ వాక్

-సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

-జెండా ఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు



మెదక్ జిల్లా -30అక్టోబర్ (మహాప్రభ).
మెదక్: సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, వాటి బారిన పడకుండా అప్రమత్తం చేయడమే లక్ష్యంగా మెదక్ పట్టణంలో శుక్రవారం ఫ్లాష్ వాక్ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ జెండా ఊపి ఫ్లాష్ వాక్‌ను ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి రామాలయం మీదుగా రాందాస్ చౌరస్తా వరకు ఈ ఫ్లాష్ వాక్ కొనసాగింది.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టుల పేరుతో బెదిరింపుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారం వెల్లడించవద్దని తెలిపారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని కోరారు.సైబర్ నేరానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, డీఎస్పీలు సుభాష్ చంద్రబోస్, రంగనాథ్, సీఐలు మహేష్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చండి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టాలి -- సర్పంచ్ ప్రవీణ్



శివ్వంపేట అక్టోబర్ 30(మహాప్రభ)
మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని చండి గ్రామంలో శనివారం సర్పంచ్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారుల చేతుల్లో పెట్టకుండా నేరుగా కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి విక్రయించుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రం ద్వారా రైతులకు సరైన సేవలు అందించి, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు.గ్రామంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రం అందుబాటులోకి రావడంతో రైతులకు రవాణా ఇబ్బందులు తగ్గడంతో పాటు ఎంతో మేలు చేకూరనుందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అడ్డంగా బ్యానర్లు.. వాహనదారులకు తప్పని ఇబ్బందులు



శివ్వంపేట, అక్టోబర్ 30 (మహాప్రభ
శివ్వంపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన బ్యానర్లు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రహదారి కనిపించకుండా అడ్డంగా బ్యానర్లు ఏర్పాటు చేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి అడ్డుగా ఉన్న బ్యానర్లను తొలగించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎల్మినో పై కళాజాత ప్రదర్శన



శివ్వంపేట అక్టోబర్ 30(మహాప్రభ)
మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిభాసింగ్ , జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి శ్రీ రామ చంద్ర రాజు ఆదేశానుసారంగా మెదక్ జిల్లా శివంపేట మండలం లోని మాగ్దుం పుర్ గ్రామం లో గ్రామ పంచాయతీ దగ్గర గ్రామ సర్పంచ్ , ఆధ్వర్యంలో లెనినోలిపై కళా ప్రదర్శన నిర్వహించడం జరిగింది.పోయిన వర్షాకాలం లో మునుపటి కంటే 20% వర్షపాతం తక్కువ కురిసింది. ఏ జలషయాల్లో నీరు నిండుగలేదు అన్ని జలషయాళ్ళు ఖాళీ అయ్యినవి.అందుకే రైతులు అందరికి ఒకటే మనవి చేస్తున్నాం రైతులు ఆరుతది పంటలు వేసుకోవాలి. నీళ్లను పొదుపుగా వాడుకోవాలి.పశువులు, మేకలు, గొర్రెలు ఎండ వేడిమి కి తట్టుకోలేవు కాబట్టి పశువులను నీడలోనే ఉంచాలి పొద్దున్న మెత్తకు తీసుకెళ్లాలి. పశువులనను కాపాడుకోవాలి.వాతావరణం లో మార్పుల వలన మర్చిలో ఉండే ఎండలు నవంబర్ నెలలోనే ప్రారంభం అవుతాయాన్ని తగు జాగ్రత్తలు తీసుకోవాలి.ఇవి అన్ని దృష్టిలో ఉంచుకొని కరెంటు ఎక్కువగా వాడుతాం కాబట్టి కరెంటు ఉత్పత్తి తగ్గి పోతుంది కావున మనం అందరం కరెంటును పొదుపు గా వాడుకుందాం అని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించటం జరిగింది కార్యక్రమం లో పాల్గొన్న కళాకారులు కొమ్ముల శేఖర్ గౌడ్, ,నేనావత్ మదన్ సింగ్, ధరవత్ రాజు, శివోళ్ల క్రిష్ణ, కారంగుల మాధవి , గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

రామాయంపేటలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రక్తదాన శిబిరం, ఉచిత మెగా వైద్య శిబిరం



రామాయంపేట అక్టోబర్ 30 మహాప్రభ
విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని రామాయంపేట పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో నేడు మెగా వైద్య శిబిరం మరియు రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస్ రావు, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, రామాయంపేట సీఐ సైదా నాయక్,ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు. యువత, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. పోలీసుల సేవలను, త్యాగాలను స్మరించుకుంటూ, సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని స్థానికులు కొనియాడారు.

అంగన్వాడీ కేంద్రాల్లో స్వచ్ఛత అభియాన్ కార్యక్రమం



శివ్వంపేట అక్టోబర్, 30(మహాప్రభ)
శివ్వంపేట మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో జిల్లా సంక్షేమ అధికారి హేమాభార్గవి ఆదేశాల మేరకు స్వచ్ఛత అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి అంగన్వాడీ కేంద్రం లోపల మరియు బయట పరిసర ప్రాంతాల్లో శుభ్రత పనులు చేపట్టడం జరిగింది. కేంద్రాల్లో ఉన్న అనవసరమైన వస్తువులను తొలగించి, పిల్లలకు ఆహ్లాదకరమైన మరియు సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించడం జరిగింది. అదేవిధంగా పిల్లలకు ప్రమాదం కలిగించే వస్తువులు ఏవైనా ఉంటే వెంటనే తొలగించాలని అంగన్వాడీ సిబ్బందికి తెలియజేయడం జరిగింది. అంగన్వాడీ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, అనవసరమైన సామాగ్రి మరియు ఇతర వ్యర్థాలను గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా చెండి అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష, పంచాయతీ కార్యదర్శి వీణా పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక 'అలయ్ బలయ్'



దేవరకొండ అక్టోబర్ 30(మహాప్రభ)
జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాస్ నేమోరీ శంకర్ గౌడ్ రామ్ తాలూరి రాష్ట్ర నాయకులు అందరి సమక్షంలో అలయ్ బలయ్' వేడుకలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో, వైభవంగా నిర్వహించబడ్డాయి ఈ ఆత్మీయ సమేళనంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోర్ర చందు నాయక్ పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా కోర్ర చందు నాయక్ మాట్లాడుతూ--- అలయ్ బలయ్ అనేది కేవలం ఒక పండుగ వేడుక మాత్రమే కాదని, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, ప్రేమాభిమానాలు మరియు సోదరభావానికి ప్రతీక అని కొనియాడారు. పరస్పర ఆత్మీయ ఆలింగనాలతో, కష్టసుఖాలను పంచుకుంటూ ఐక్యతను చాటడమే ఈ వేడుక యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు పార్టీ శ్రేణులు, నాయకులు మరియు కార్యకర్తలందరూ ఒకే కుటుంబంగా కలిసికట్టుగా పనిచేసి, పార్టీ బలోపేతానికి మరియు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు రాష్ట్ర స్థాయి నాయకుల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో కోలాహలంగా, దిగ్విజయంగా పూర్తయినందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు పాల్గొన్న ముఖ్య నాయకులు ఈ వేడుకలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోర్ర చందు నాయక్‌తో పాటు నల్లవెల్లి శ్రీనివాస్, కాటేబాక నవీన్, కాటేపాక మహేష్, ఒంటెద్దు మహేష్, గిరి సురేష్, రవి, దేవరకొండ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దంతాన్‌పల్లిలో మహిళా భవన నిర్మాణ పనులకు శ్రీకారం

సర్పంచ్ గజేంద్రుల మమత--నర్సింలు ఆధ్వర్యంలో భవన నిర్మాణానికి ముగ్గు పోత



శివ్వంపేట అక్టోబర్ 30(మహాప్రభ)
శివ్వంపేట మండలంలోని దంతాన్‌పల్లి గ్రామంలో మహిళా భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ గజేంద్రుల మమత--నర్సింలు ఆధ్వర్యంలో మహిళా భవనం నిర్మాణానికి శనివారం ముగ్గు పోశారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలకు ప్రత్యేకంగా భవనం ఏర్పాటు కావడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. మహిళా సంఘాల సమావేశాలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో , ఉపసర్పంచ్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, మహిళా సంఘాల అధ్యక్షురాలు, సీఏ, గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

మాజీ వార్డు సభ్యురాలు కంది బబిత మృతి పట్ల చిలుముల సుహాసిని రెడ్డి సంతాపం

-పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



నర్సాపూర్:అక్టోబర్
నర్సాపూర్ 30 (మహాప్రభ)
నర్సాపూర్ మున్సిపాలిటీకి చెందిన మాజీ వార్డు సభ్యురాలు కంది బబిత (భర్త కంది ప్రభాకర్) మృతి పట్ల మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. కంది బబిత మృతి విషయం తెలుసుకున్న చిలుముల సుహాసిని రెడ్డి వారి పార్థివదేహం వద్దకు చేరుకుని పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంది బబిత మృతి బాధాకరమని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలి -- గోవర్ధన్ నాయా

నవంబర్ 6లోగా నమోదు చేసుకోవాలి..
అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 30 మహా ప్రభ
డిగ్రీ పూర్తి చేసిన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో-కోఆర్డినేటర్, బస్వాయిపల్లి గ్రామ ఉపసర్పంచ్ గోవర్ధన్ నాయా పిలుపునిచ్చారు. హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సామ రాంమోహన్ రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియకు నవంబర్ 6 చివరి తేదీ కావడంతో అర్హులైన యువత, పట్టభద్రులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల గొంతుకను వినిపించేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకమని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందడంతో పాటు, తమ పరిసర ప్రాంతాల్లోని అర్హులకు అవగాహన కల్పించి నమోదు ప్రక్రియలో భాగస్వాములను చేయాలని గోవర్ధన్ నాయా విజ్ఞప్తి చేశారు.

ఓట్ల దొంగతనంపై ఢిల్లీలో సమరభేరి..!!

-ప్రజాస్వామ్య పరిరక్షణకు ఢిల్లీలో రాహుల్ గాంధీ నేతృత్వంలో మార్చ్
-వనపర్తి డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి పిలుపు..

వనపర్తి అక్టోబర్ 30 మహా ప్రభ
వనపర్తి జిల్లా నుంచి దాదాపు 180 నుంచి 200 మంది కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీకి ప్రయాణం.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడంతోపాటు ఓట్ల దొంగతనాన్ని అడ్డుకునేందుకు చేపడుతున్న ఆత్మరక్షణ మార్చ్‌కు పార్టీలకతీతంగా ప్రజాస్వామ్యవాదులంతా తరలిరావాలని వనపర్తి డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి శుక్రవారం పిలుపునిచ్చారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా నుంచి 150 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజాప్రతినిధులు ఢిల్లీకి బయలుదేరారన్నారు. బస్సుల్లో, రైల్లో, ఫ్లైట్ ల్లో మార్గాలలో ఢిల్లీకి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ అగ్రనేత, పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న ఈ మార్చ్‌ను విజయవంతం చేయాలని కోరారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని,



ప్రజల ఓటు హక్కుకు రక్షణ కల్పించడం, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు చరమగీతం పాడే రోజులు ఆసన్నమయ్యాయని శివసేన రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ఆ ఓటు హక్కుకే ముప్పు వాటిల్లితే ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. ఓట్ల దొంగతనాన్ని అడ్డుకోవడం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడటం, రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడం లక్ష్యంగా ఈ ఆత్మరక్షణ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలితో విసిగిపోయిన వారంతా ఈ మార్చ్‌లో పాల్గొనాలని శివసేన రెడ్డి కోరారు. ప్రజల ఓటు హక్కును కాపాడుకోవడం ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని, దేశ భవిష్యత్తు, ప్రజాస్వామ్య మనుగడకు సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఈ నిరసన కార్యక్రమానికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించేందుకు చేపడుతున్న ఈ మార్చ్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికే పరిమితం కాదని, ఇది భారతదేశ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమమని ఆయన పేర్కొన్నారు. ఓట్ల దొంగతనాన్ని అడ్డుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలంటే ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగే ఆత్మరక్షణ మార్చ్‌కు ప్రజాస్వామ్యవాదులు, ప్రజా హక్కుల పరిరక్షణను కోరుకునే వారందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శివసేన రెడ్డి పిలుపునిచ్చారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరం -- 129 యూనిట్ల రక్త సేకరణ

-డి. సునీత రెడ్డి, ఐపీఎస్., జిల్లా ఎస్పీ
- జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 129 మంది ప్రజలు, యువత, పోలీసు సిబ్బంది.
-అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజాసేవా కార్యక్రమాల నిర్వహణ.
-అత్యవసర సమయాల్లో రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు.
- రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ.

వనపర్తి అక్టోబర్ 30 మహా ప్రభ
పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వనపర్తి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ శ్రీమతి డి. సునీత రెడ్డి, ఐపీఎస్., ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా



రక్తదానం చేశారు. మొత్తం 129 మంది రక్తదానం చేయగా, 129 యూనిట్ల రక్తాన్ని సేకరించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వనపర్తికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సమాజం, దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం ఎంతో విలువైనదని, రక్తదానం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చని తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ ఎస్పీ అభినందించారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, లా అండ్ ఆర్డర్ డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ, వనపర్తి సీఐ సుగంధ రత్నం, కొత్తకోట సీఐ రమేష్, ఆత్మకూరు సీఐ శివకుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, అప్పల నాయుడు, జిల్లాలోని ఎస్సైలు, పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ జ్యోతి మేడమ్, ఆర్ఎం డాక్టర్ జావీద్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొని రక్తదాన శిబిరం విజయవంతానికి సహకరించారు. అలాగే విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కౌకుంట్ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట





-రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు
-తెలంగాణ పబ్లిక్ స్కూల్, మండల కాంప్లెక్స్, రహదారులు, బ్రిడ్జిల నిర్మాణానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే జీఎంఆర్



దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 30 మహా ప్రభ
దేవరకద్ర నియోజకవర్గం కౌకుంట్ల మండలం. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోని కౌకుంట్ల మండలానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ భారీగా నిధులు కేటాయిస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) అన్నారు. కౌకుంట్ల రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్, అర్హులైన వారికి స్మార్ట్ రేషన్ కార్డులు, రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కౌకుంట్లను మండల కేంద్రంగా ప్రకటించి, గెజిట్‌లో సైతం చేర్చకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ వంటి కీలక కార్యాలయాలను ఏర్పాటు చేయకపోవడంతోపాటు, ప్రభుత్వ కార్యాలయాలకు అద్దెలు చెల్లించక తాళాలు వేసే పరిస్థితి తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యాలయాల అద్దెలు చెల్లించి ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు.
కౌకుంట్ల మండల అభివృద్ధి కోసం పలు కీలక పనులకు నిధులు కేటాయించినట్లు వివరించారు. రూ.11.92 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్, రూ.2.50 కోట్లతో మండల సమీకృత కార్యాలయ సముదాయం, రూ.35 కోట్లతో ఎన్‌హెచ్-44 నుంచి ఇస్రాంపల్లి, పెద్ద మునగాలచేడ్ మీదుగా కౌకుంట్ల వరకు రహదారి, హెచ్ఎల్‌బీ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే వెంకంపల్లి--రేకులంపల్లి బ్రిడ్జికి రూ.1.80 కోట్లు, కౌకుంట్ల--రాచాల, ఇస్రాంపల్లి బ్రిడ్జిలకు రూ.5.40 కోట్లు, ముచ్చింతల నుంచి ఎర్నాల (ఫర్దిపూర్) గేట్ వరకు బ్రిడ్జి నిర్మాణానికి రూ.40 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు వెల్లడించారు.ఇదే విధంగా మినిగోనిపల్లి నుంచి కురుమూర్తి స్వామి దేవస్థానం మీదుగా వెంకంపల్లి, పేరూరు, ముత్యాలంపల్లి నుంచి వర్నే వరకు రూ.103.54 కోట్లతో డబుల్ రోడ్ల నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే పలు గ్రామాలకు మెరుగైన రవాణా సదుపాయం కలుగుతుందని చెప్పారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కౌకుంట్ల మండలంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా నిర్మించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం తొలి విడతలోనే మండలానికి 232 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. విద్య, మౌలిక సదుపాయాలు, రవాణా, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు.కొత్త అరవింద్ కుమార్ రెడ్డికి సింగిల్ విండో చైర్మన్ బాధ్యతలుఈ కార్యక్రమంలో దేవరకద్ర సింగిల్ విండో చైర్మన్‌గా కొత్త అరవింద్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రకటించారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు, రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌకుట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి కిషన్ రావు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజినెస్

లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

- 308 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 116 పాయింట్ల లాభంతో ముగిసిన నిఫ్టీ
- మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడి
- మార్కెట్‌పై విదేశీ మదుపర్ల విక్రయాల ప్రభావం



ముంబై, బిజినెస్ డెస్క్

దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, ద్రవ్యోల్బణ ఆందోళనలు, విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాల ఒత్తిడి మధ్య ప్రధాన సూచీలు లాభాలను నమోదు చేశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ 308 పాయింట్లు పెరిగి 74,466 వద్ద ముగియగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 116 పాయింట్ల లాభంతో 23,053 వద్ద స్థిరపడింది. ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైనప్పటి నుంచి కొనుగోళ్ల జోరు కనిపించినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీల దూకుడుకు కొంత అడ్డుకట్ట పడింది. ప్రధానంగా ట్రెంట్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాలను నమోదు చేయగా, శ్రీరామ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు కొనసాగడం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల విక్రయాలు కూడా సూచీలపై ఒత్తిడి పెంచాయి. అయినప్పటికీ కొన్ని ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు చివరకు లాభాల్లో ముగిశాయి. రానున్న రోజుల్లో అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు, ముడి చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం ఆధారంగా మార్కెట్ గమనం ఉండవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

రూ.10 లక్షల్లోపే హ్యుందాయ్ ఎలక్ట్రిక్ కారు!

- భారత మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని సరికొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ
- 'ఐయోనిక్ పి' పేరుతో విడుదలకు సన్నాహాలు
- దేశీయంగా బ్యాటరీల తయారీకి ఎక్సైడ్‌తో ప్రణాళికలు
- ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదలయ్యే అవకాశం



న్యూఢిల్లీ, బిజినెస్ డెస్క్:

భారత ఎలక్ట్రిక్ వాహన మార్కెట్‌లో పోటీని మరింత పెంచేందుకు దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ సిద్ధమవుతోంది. సామాన్య, మధ్యతరగతి వినియోగదారులకు అందుబాటు ధరలో ఎలక్ట్రిక్ కారును తీసుకురావాలనే లక్ష్యంతో సరికొత్త ఎంట్రీ లెవల్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని అభివృద్ధి చేస్తోంది. 'హ్యుందాయ్ ఐయోనిక్ పి' పేరుతో ప్రచారంలో ఉన్న ఈ కారును హెచ్ఈ1ఐ సంకేత నామంతో రూపొందిస్తున్నట్లు సమాచారం. దీని ప్రారంభ ధర రూ. 10 లక్షల లోపు ఉండే అవకాశముందని ఆటోమొబైల్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కంపెనీ 2026 మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో భారత ఈవీ మార్కెట్ విస్తరణ ప్రణాళికలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కొత్త ఎలక్ట్రిక్ కారు తయారీలో దేశీయ విడిభాగాల వినియోగాన్ని పెంచేందుకు హ్యుందాయ్ ప్రాధాన్యం ఇస్తోంది. ప్రారంభ దశలో బ్యాటరీలను విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నప్పటికీ, భవిష్యత్తులో ఎక్సైడ్ సంస్థ నుంచి స్థానికంగా బ్యాటరీలను సేకరించాలని యోచిస్తోంది. తద్వారా తయారీ వ్యయాన్ని తగ్గించి వినియోగదారులకు తక్కువ ధరకు వాహనాన్ని అందించాలన్నది కంపెనీ వ్యూహంగా కనిపిస్తోంది. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో కొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మార్కెట్లోకి వచ్చే అవకాశముందని అంచనా. అయితే కారు అధికారిక పేరు, ధర, విడుదల తేదీపై కంపెనీ నుంచి పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

భారీగా దిగొచ్చిన బంగారం ధరలు!

- తులం బంగారంపై రూ.1,690 తగ్గుదల
- రూ.1,42,260కు చేరిన 24 క్యారెట్ల పసిడి
- 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,30,400
- కిలో వెండిపై ఏకంగా రూ.5 వేల తగ్గుదల



హైదరాబాద్, బిజినెస్ డెస్క్:

పసిడి ప్రియులకు ఊరట కలిగించే వార్త. వారం రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు శుక్రవారం ఒక్కసారిగా దిగొచ్చాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,690 తగ్గి రూ. 1,42,260కు చేరింది. ఆభరణాల తయారీలో వినియోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,550 తగ్గి రూ. 1,30,400 వద్ద కొనసాగుతోంది. బంగారంతోపాటు వెండి ధర కూడా భారీగా పడిపోయింది. కిలో వెండి ధర ఏకంగా రూ. 5 వేలు తగ్గి రూ. 2,10,000కు చేరింది. గత కొన్ని రోజులుగా పసిడి ధరలు పెరుగుతుండటంతో కొనుగోలుదారులు ఆందోళన చెందగా, తాజాగా నమోదైన తగ్గుదల కొంత ఉపశమనం కలిగించింది. ముఖ్యంగా వివాహాలు, శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ పరిణామం ఊరటనిచ్చే అంశంగా మారింది. అయితే పేర్కొన్న ధరలకు అదనంగా మూడు శాతం వస్తు సేవల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఆభరణాల కొనుగోలులో తయారీ చార్జీలు కూడా వర్తిస్తాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో స్థానిక మార్కెట్ పరిస్థితులను బట్టి ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండవచ్చు.

కివీస్‌తో వన్డేలకు ప్రసిద్ధ కృష్ణ దూరం..

ఇండియా-ఏ జట్టులోకి సిరాజ్

స్పోర్ట్స్

వెల్లింగ్టన్: ఇండియా, ఇండియా-ఏ జట్లు ప్రస్తుతం న్యూజిలాండ్‌లో టూరు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే కివీస్‌తో జరిగే అయిదు వన్డేలకు పేస్ బౌలర్ ప్రసిద్ధ కృష్ణ దూరం కానున్నాడు. ఇంకా అతను ఫిట్‌కాని కారణంగా వన్డేలకు పక్కనపెట్టారు. తొడకండరాల గాయం నుంచి అతను కోలుకుంటున్నాడు. ప్రసిద్ధ కృష్ణ కోలుకోవడానికి ఇంకా సమయం పడుతుందని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. అయితే న్యూజిలాండ్-ఏ జట్టుతో జరిగే మూడవ, నాలుగవ మ్యాచ్‌లకు ఇండియాఏ జట్టుతో ప్రసిద్ధ కృష్ణ కలుస్తాడని బీసీసీఐ చెప్పింది. అది కూడా అతను ఫిట్ అయితేనే అని పేర్కొన్నది. ఒకవేళ ఏ జట్టుతో అతను ఆడితే, అతనికి టెస్టు సిరీస్ ముందు అతనికి ప్రాక్టీస్ అవుతుంది.అక్టోబర్ 31 నుంచి న్యూజిలాండ్-ఏతో జరిగే రెండో మ్యాచ్ కోసం సిరాజ్ భారత్-ఏ జట్టుతో జతకూడనున్నాడు. ఇక నితీశ్ కుమార్ రెడ్డి కివీస్‌తో జరిగే తొలి వన్డేకు అందుబాటులో ఉంటాడు. ఆ తర్వాత అతను ఇండియా ఏ జట్టుతో జరిగే మూడో, నాలుగు మ్యాచ్‌లో ఆడుతాడు. నవంబర్ 19 నుంచి కివీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు నితీశ్ రెడ్డికి ప్రివిలేషన్ కానున్నది.తొలి మూడు వన్డేలు భారత జట్టు : గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, కోహ్లీ, అయ్యర్, కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, నమన్ ధీర్, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్, రుతురాజ్ గైక్వాడ్, అర్షదీప్ సింగ్, ఇషాన్ కిషన్, సిరాజ్, కుల్దీప్, నితీశ్.



నాలుగో, అయిదో వన్డేలకు జట్టు: అయ్యర్(కెప్టెన్), రోహిత్, కోహ్లీ, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్, నమన్ ధీర్, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, రుతురాజ్ గైక్వాడ్, అర్షదీప్ సింగ్, కుమార్ కుషాగ్రా, సిరాజ్, యశ్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్.

గిల్, పీవీ సింధు నుదిటిపై వింత పరికరం..

అసలు ఆ డివైజ్ ఏంటి? దాన్ని ఎందుకు వాడుతున్నారు?



టీమిండియా టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నుదుటిపై కనిపించిన ఓ చిన్న పరికరం ఇప్పుడు ఆసక్తికర చర్చకు దారితీసింది. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు సన్నద్ధమవుతున్న భారత జట్టు గురువారం ఆక్లాండ్‌లో సాధన చేస్తుండగా.. గిల్ ఈ పరికరాన్ని ధరించి కనిపించాడు. సాధారణంగా ఆటగాళ్లు చేతికి స్మార్ట్‌వాచ్‌లు, ఫిట్‌నెస్ బ్యాండ్లు ధరిస్తుంటారు. అందుకు భిన్నంగా నుదుటిపై ఈ చిన్న డివైజ్ ఉండటంతో అసలు ఇదేంటనే ఆసక్తి మొదలైంది. అసలు ఆ డివైజ్ ఏంటి? దాన్ని ఎందుకు ధరించాడనేది చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఆ పరికరం గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

అసలేంటి డివైజ్!

గిల్ ధరించిన డివైజ్ పేరు 'టెంపుల్'. శరీర ఫిట్‌నెస్‌తో పాటు మెదడుకు సంబంధించిన శారీరక సంకేతాలను పర్యవేక్షించడమే దీని ప్రత్యేకత. జొమాటో వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ మద్దతుతో పనిచేస్తున్న బృందం ఈ టెంపుల్ పరికరాన్ని అభివృద్ధి చేస్తోంది. ప్రస్తుతం ఇది పరీక్షల దశలో ఉంది. సాధారణ ఫిట్‌నెస్ ట్రాకర్ల మాదిరిగా గుండె స్పందన, అడుగులు, కేలరీల లెక్కలకే పరిమితం కాకుండా.. మెదడుకు రక్తప్రసరణ, ఆక్సిజన్ స్థాయుల్లో వచ్చే మార్పులను అంచనా వేయడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ పరికరాన్ని నుదుటి పక్కభాగంలో కణత సమీపాన అమర్చుకుంటారు. దీని పనితీరు, ప్రత్యేకతలపై ఇప్పటికే ఆసక్తి పెరగ్గా.. ప్రముఖ క్రీడాకారులు ఉపయోగిస్తుండటం మరింత చర్చకు కారణమైంది.

ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ కోచ్‌గా రాబిన్ ఊతప్ప!

- ఐపీఎల్ కొత్త సీజన్‌కు ముంబై కోచింగ్ బృందంలో భారీ మార్పులు
- బౌలింగ్ కోచ్‌గా మిచెల్ మెక్‌క్లెనాగన్
- ఫీల్డింగ్ కోచ్‌గా టీ దిలీప్‌కు బాధ్యతలు
- బౌలింగ్ డెవలప్‌మెంట్ కోచ్‌గా ధావల్ కులకర్ణి



ముంబై, స్పోర్ట్స్ డెస్క్

ఐపీఎల్ కొత్త సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ జట్టు కోచింగ్ విభాగంలో కీలక మార్పులు చేపట్టింది. భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్పను జట్టు బ్యాటింగ్ కోచ్‌గా నియమించినట్లు వెల్లడించింది. వచ్చే సీజన్ నుంచి ఊతప్ప ముంబై బ్యాటర్లకు శిక్షణ ఇవ్వనున్నాడు. న్యూజిలాండ్ మాజీ పేసర్ మిచెల్ మెక్‌క్లెనాగన్‌ను బౌలింగ్ కోచ్‌గా, టీ దిలీప్‌ను ఫీల్డింగ్ కోచ్‌గా, భారత మాజీ పేసర్ ధావల్ కులకర్ణిని బౌలింగ్ డెవలప్‌మెంట్ కోచ్‌గా ఎంపిక చేసింది. ప్రధాన కోచ్‌గా కీరన్ పొలార్డ్‌ను నియమించిన నేపథ్యంలో అనుభవజ్ఞులైన మాజీ క్రికెటర్లతో కోచింగ్ బృందాన్ని బలోపేతం చేయడంపై ముంబై యాజమాన్యం దృష్టి సారించింది. ముంబై ఇండియన్స్ తరపున గతంలో ఆడిన అనుభవం ఊతప్ప, మెక్‌క్లెనాగన్‌కు ఉంది. ముంబై తరపున ఒక సీజన్‌లో 14 మ్యాచ్‌లు ఆడిన ఊతప్ప 320 పరుగులు సాధించాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. తన ఐపీఎల్ కెరీర్‌లో మొత్తం 205 మ్యాచ్‌లు ఆడి 4,952 పరుగులు నమోదు చేశాడు. మరోవైపు మెక్‌క్లెనాగన్ ముంబై తరపున 56 మ్యాచ్‌ల్లో 71 వికెట్లు పడగొట్టాడు. 2015, 2019 సంవత్సరాల్లో ముంబై ఇండియన్స్ టైటిళ్లు సాధించిన జట్లలో అతడు సభ్యుడిగా ఉన్నాడు. కొత్త కోచింగ్ బృందం ఆధ్వర్యంలో రాబోయే సీజన్‌లో మెరుగైన ప్రదర్శన కనబరచాలని ముంబై ఇండియన్స్ లక్ష్యంగా పెట్టుకుంది.

మళ్లీ థియేటర్లలోకి కార్తీ కల్ట్ క్లాసిక్ 'ఆవారా'..

గ్రాండ్ రీ-రిలీజ్ డేట్ ఫిక్స్!



టాలీవుడ్ మరియు కోలీవుడ్‌లో ఎప్పటికీ మర్చిపోలేని కల్ట్ క్లాసిక్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఆవారా'. హీరో కార్తీ, తమన్నా జంటగా, లింగుస్వామి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో పాటు తెలుగు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా యువన్ శంకర్ రాజా అందించిన మ్యూజిక్ ఈ సినిమాకి ప్రాణం పోసింది. అయితే అప్పట్లో ట్రెండ్ సెట్ చేసిన ఈ బ్లాక్ బస్టర్ మూవీ ఇప్పుడు సరికొత్త హంగులతో మరోసారి థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. 'ఆవారా 4K' వెర్షన్‌లో డిసెంబర్ 3న గ్రాండ్‌గా రీ-రిలీజ్ కాబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.కేదార్ ఫిల్మ్స్ రిలీజ్ చేస్తున్న ఈ సినిమాని బిగ్ స్క్రీన్‌పై మరోసారి చూసేందుకు కార్తీ అభిమానులు మరియు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. థియేటర్లలో మరోసారి యువన్ మ్యూజిక్ మానియా, కార్తీ-తమన్నా కెమిస్ట్రీని ఎంజాయ్ చేయడానికి రంగం సిద్ధమైంది!

'కల్ట్'లో కనికరం లేని పోలీస్



'ప్రేక్షకులకు కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని చేసిన ప్రయత్నమిది. ఈ సినిమా కోసం చాలా ఎక్స్‌పెరిమెంట్స్‌చేశాను. అసలు ఈ సినిమా రాసుకున్నప్పుడు.. ఇది కలలా కాగితంపైనే ఉండిపోతుందేమో అనుకున్నాను.కానీ దీన్ని వెండితెరపైకి తెచ్చిన తారక్ సినిమాస్‌కి ధన్యవాదాలు. ఇది చాలా క్రేజీ సినిమా. ఎక్కడాకాంప్రమైజ్ కాకుండా ఈ సినిమా తీశాను.హై క్వాలిటీ ప్రొడక్ట్‌గా ఇది రానున్నది. సున్నిత మనస్కులు, చిన్న పిల్లలు ఈ సినిమాకు కొంచెం దూరంగా ఉండాలని కోరుతున్నా. ఎందుకంటే ఇదిచాలా వైల్డ్ సినిమా. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరూ ప్రాణం పెట్టారు. థియేటర్‌లో అంతా ఈ సినిమాను 6.5 సౌండ్‌లో చూడమని కోరుతున్నా' అని చిత్ర దర్శకుడు, కథానాయకుడు విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో నటించిన స్లాషర్ థ్రిల్లర్ 'కల్ట్'. సందీప్ కాకరాల నిర్మాత. వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కిన ఈచిత్రం ఈ నెల 30న విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడారు. ఇంకా నటులు కార్తికేయ, తారక్ పొన్నప్ప, యజ్ఞ తుర్లపాటి, అనిరుధ్ కూడా మాట్లాడారు. ట్రైలర్ ఆద్యంతం యాక్షన్, స్లాషర్ ఎలిమెంట్స్‌తో సాగింది. విశ్వక్‌సేన్ ఈ ట్రైలర్‌లో కనికరం లేని పోలీస్‌గా కనిపించాడు.



గోల్డెన్ గ్లామర్‌లో జాన్వీ కపూర్.. అందంతో అదరహో!

సినిమా డెస్క్:

బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ మరోసారి తన గ్లామర్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. వెండితెరపై నటనతో అలరిస్తూనే ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేస్తున్న ఈ ముద్దుగుమ్మ.. గోల్డెన్ లుక్‌తో అందాల మెరుపులు మెరిపిస్తోంది. బంగారు వర్ణపు దుస్తుల్లో జాన్వీ అందం మరింత ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఆకట్టుకునే హావభావాలు, ఆత్మవిశ్వాసంతో కూడిన పోజులు ఆమె స్టైల్‌కు మరింత వన్నె తెస్తున్నాయి. అలనాటి అందాల తార శ్రీదేవి వారసురాలిగా సినీ రంగంలోకి అడుగుపెట్టిన జాన్వీ కపూర్.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. సినిమాలతో పాటు ఫ్యాషన్ ఫొటోషూట్లతోనూ అభిమానులను అలరిస్తోంది. సంప్రదాయ దుస్తుల నుంచి ఆధునిక ఫ్యాషన్ వరకు ఎలాంటి వస్త్రధారణలోనైనా ఆకట్టుకోవడం జాన్వీ ప్రత్యేకత. గ్లామర్‌తోపాటు నటనలోనూ తన ప్రతిభను చాటుకునేందుకు విభిన్న పాత్రలను ఎంచుకుంటోంది. తాజాగా 'కాఫీ విత్ కరణ్' తొమ్మిదో సీజన్‌లో మెరిసిన జాన్వీ.. ప్రముఖ ఫ్యాషన్ సంస్థ మోర్ష్ రూపొందించిన బంగారు వర్ణపు మినీ డ్రెస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ దుస్తుల ధర సుమారు రూ.9.3 లక్షలని ఫ్యాషన్ కథనాలు వెల్లడించాయి. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలను పంచుకోవడంతో అభిమానుల దృష్టిని ఆకర్షించాయి.



21 రోజుల్లోనే ఓటీటీలోకి 'కామ్రేడ్ కళ్యాణ్'!



హైదరాబాద్, సినిమా డెస్క్

టాలీవుడ్ యువ కథానాయకుడు శ్రీవిష్ణు నటించిన 'కామ్రేడ్ కళ్యాణ్' చిత్రం అనూహ్యంగా ఓటీటీలోకి వచ్చేసింది. థియేటర్లలో విడుదలైన కేవలం 21 రోజుల్లోనే డిజిటల్ ప్రేక్షకుల ముందుకు రావడం విశేషం. అక్టోబర్ 9న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం అక్టోబర్ 30 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారమవుతోంది. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే స్ట్రీమింగ్ ప్రారంభం కావడం సినీ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. థియేటర్లలో ఈ చిత్రాన్ని చూడలేకపోయిన ప్రేక్షకులకు ఇప్పుడు ఇంట్లోనే వీక్షించే అవకాశం లభించింది. తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం అందుబాటులోకి వచ్చింది. శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ కథానాయికగా నటించగా, జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహించారు. కోన వెంకట్ సమర్పణలో వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మించిన ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే, సత్య తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రేమ, హాస్యం, రాజకీయ సంఘర్షణల మేళవింపుతో రూపొందిన ఈ సినిమా కథ 1990వ దశకంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో సాగుతుంది. గ్రామంలో సినిమా థియేటర్ నడుపుకునే తాడికొండ కళ్యాణ్ జీవితంలోకి సితార అనే యువతి ప్రవేశించడంతో కథ కీలక మలుపు తిరుగుతుంది. ఆమె కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేసేందుకు కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం అతడిని అనూహ్య పరిస్థితుల్లోకి నెడుతుంది. సాధారణ యువకుడిగా జీవితం సాగిస్తున్న కళ్యాణ్ పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఎలా మారాడు? నక్సలైట్ దళాలతో అతడికి సంబంధం ఏమిటి? ప్రేమించిన యువతి కోసం అతడు ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నాడు? అనే అంశాల చుట్టూ కథ ఆసక్తికరంగా సాగుతుంది. థియేటర్లలో ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

'ఛావా' దర్శకుడి కొత్త సినిమా..

శ్రద్ధా కపూర్ 'ఈఠా' ట్రైలర్ విడుదల!



బాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన 'ఛావా' చిత్రానికి దర్శకత్వం వహించిన టాలెంటెడ్ డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఈఠా' (జుమ్మ్లు). ప్రముఖ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. మహారాష్ట్ర సాంస్కృతిక జానపద కళాకారిణి, లావణీ లెజెండ్ విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ బయోపిక్ రూపొందుతోంది.ఈ చిత్రంలో శ్రద్ధా కపూర్ విఠాబాయి పాత్రలో పరకాయ ప్రవేశం చేసి కనిపించనున్నారు. ఆమె కెరీర్‌లో ఇదొక మైలురాయిగా నిలిచే పాత్ర అని ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. మహారాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే లావణీ నృత్య రూపం మరియు ఒక సాధారణ మహిళా కళాకారిణి అసాధారణ విజయాలు సాధించే ప్రయాణాన్ని ట్రైలర్‌లో అత్యద్భుతంగా హైలైట్ చేశారు. ప్రముఖ నిర్మాత దినేష్ విజాన్ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టాలెంటెడ్ యాక్టర్ రణ్‌దీప్ హూడా కూడా ఒక కీలకమైన పాత్రలో నటిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచేశారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com